# ఇది రిజర్వేషన్ల దేశం

బొజ్జా తారకం

ధర : రూ. 150/–
హక్కులు : © బొజ్జా తారకం ట్రస్ట్
మొదటి ముద్రణ : సెప్టెంబరు 2019
ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్,
గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006.
ఫోన్ : 23521849
www.hyderabadbooktrust.blogspot.com

---

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్,
హైదరాబాద్ – 28 ఫోన్ : 23391364, 23304194
Email: anupamaprinters@yahoo.co.in

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| | ముందుమాట | | 3-4 |
| | ప్రస్తావన | | 6-10 |
| I | i | రిజర్వేషన్లు ఎలా వచ్చాయి | 11-27 |
| | ii | ఆంగ్లేయుల పరిపాలనలో | 27-31 |
| | iii. | ఇతర కులాలు ఉద్యోగాలలో ఎలా ప్రవేశించగలిగారు? | 32 |
| | iv | కమ్యూనల్ జి.ఓ. | 32-42 |
| | v | రిజర్వేషన్ అంటే | 42-57 |
| | vi | రిజర్వేషన్ల కోసం తొలి ప్రయత్నాలు | 57-60 |
| | vii | విద్య కోసం ప్రయత్నాలు | 60-94 |
| II | i | రిజర్వేషన్లపై రగడలు ఎందుకు జరుగుతున్నాయి? | 95-127 |
| | ii | పూనా ఒడంబడిక | 127-136 |
| | iii | రిజర్వేషన్లు - రాజ్యాంగం | 136-139 |
| | iv | రిజర్వేషన్లు - సుప్రీంకోర్టు | 139-149 |
| | v | రిజర్వేషన్లు - కార్యనిర్వాహక యంత్రాంగం | 150-157 |
| III | i. | కులాలవారీ ఉద్యోగాలు | 158-161 |
| | ii | రిజర్వేషన్ల వల్ల ప్రతిభ పడిపోతుందా | 161-173 |
| | iii | రిజర్వేషన్లు అందవలసిన వారికి అందటం లేదు | 173-175 |
| | iv | రిజర్వేషన్లు అనుకున్న కాలంకంటే ఎక్కువ కాలం అమలులో ఉన్నాయి | 175-183 |
| | v | రిజర్వేషన్ల వల్లదేశ సమైక్యత దెబ్బతింటుందా | 184-189 |
| | vi | రిజర్వేషన్లు ఇలానే కొనసాగితే కులాలు పోయే ప్రసక్తే లేదు | 189-197 |
| | vii | అయితే రిజర్వేషన్లు ఇలా కొనసాగవలసిందేనా | 197-200 |
| | viii | ఈ రిజర్వేషన్లు ఒక్క భారతదేశంలోనే ఉన్నాయా | 200-208 |

# I

# రిజర్వేషన్లు ఎలా వచ్చాయి?

రిజర్వేషన్లు రాజ్యాంగం ద్వారా వచ్చాయని మనం అనుకుంటాం. అది నిజమే, రాజ్యాంగం మూడు రకాల రిజర్వేషన్లను పొందుపరచింది. ఒకటి విద్యారంగం, రెండు ఉద్యోగ రంగం, మూడు శాసనసభలు. ఇవి 1950 నుంచీ అమలులోకి వచ్చాయి. ఈ రిజర్వేషన్లు కూడా మూడు తరగతులకే పరిమితమయ్యాయి. ముగ్గురినీ కలిపి వెనుకబడిన వర్గాలు అని వ్యవహరించినా ఇందులో మూడు రకాలు ఉన్నాయి. ఒకటి షెడ్యూల్డు కులాలు, రెండు షెడ్యూల్డు జాతులు, మూడు వెనుకబడిన తరగతులు. ఈ వెనుకబడిన వర్గాలకు అందరికీ రిజర్వేషన్లు వర్తించవు. సామాజిక విద్యాపరంగా వెనుకబడిన కులాలకే ఈ వర్తింపు. ఈ దేశం కులాల దేశం కాబట్టి కులాన్నిబట్టి మనుష్యులను గుర్తించటం జరుగుతున్నది కాబట్టి, వెనుకబడిన వర్గాలలో మళ్ళీ మనకు కులాలే కనబడతాయి. అయితే వీటిని ప్రభుత్వం గుర్తించాలి. రాజ్యాంగం అమలులోకి వచ్చేసరికి షెడ్యూల్డు కులాలకు, షెడ్యూల్డు జాతులకు రిజర్వేషన్ అమలు అవుతూ వచ్చాయి కాబట్టి, వారిని ప్రభుత్వం అప్పటికే ఒక పట్టీలో తయారుచేసిపెట్టి ఉంచారు కాబట్టి, 1950 నాటికి వారికి రిజర్వేషన్లు అమలు చేయటంలో ఇబ్బంది ఏమీ లేకపోయింది. వెనుకబడిన వర్గాలను గుర్తించటం జరగలేదు కాబట్టి, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల జాబితా తయారు కాలేదు కాబట్టి 1950 నాటికి వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు అమలు కాలేదు. రాజ్యాంగం రాకముందు కొన్ని కొన్ని రాష్ట్రాలలో వెనుకబడిన వర్గాల జాబితా తయారై ఉండటంవల్ల, అక్కడ వారికి రిజర్వేషన్లు అమలవుతూ ఉండటం వల్ల ఆయా రాష్ట్రాలలో వారికి విద్యా ఉద్యోగావకాశాలు దొరికాయి. దేశవ్యాప్తంగా కేంద్ర సర్వీసులకు సంబంధించి ఒక జాబితా తయారు కాలేదు. దానిని మండల్ కమిషన్ తయారు చేసింది. దానిని 1990లో కేంద్రం ఆమోదించింది. సూత్రప్రాయంగా 1991లో ఉద్యోగాలలో మాత్రమే 27 శాతం రిజర్వేషన్ అమలుచేశారు. అది 1992లో మండల్ తీర్పు వచ్చిన తర్వాత అమలులోకి వచ్చింది. అంటే వెనుకబడిన తరగతులకు 1992 నుంచి మాత్రమే రిజర్వేషన్లు అందులోనూ కేంద్ర సర్వీసుల్లో మాత్రమే అమలు అవుతూ వచ్చాయి. విద్యా రంగంలో అమలు కాలేదు. షె.కు., షె.జా.లకు 1950 నుంచి అమలులో ఉన్నాయి. కాని బ్రాహ్మణులకు, ఇతర అగ్రకులాలకు కొన్ని వేల సంవత్సరాల నుంచీ రిజర్వేషన్లు అమలవుతూ వస్తున్నాయనే సంగతి ఎవరైనా గుర్తించారా? రాజ్యాంగం ఒకటి చెబుతుంటే అమలులో మరొక విధంగా జరుగుతున్నది.

కులవ్యవస్థ ఏర్పడిన నాటి నుంచీ, స్థిరపడిన నాటి నుంచీ ఈ రిజర్వేషన్లు అమలులో ఉన్నాయి. ఈ అమలు కూడా నూటికి నూటిపాళ్ళూ అమలులో ఉండేవి. ఈ పద్ధతికి భిన్నంగా ఎవరైనా ప్రవర్తించినా లేక వీటిని అమలుకాకుండా చూడటానికి ఏ ప్రయత్నం అయినా చేసినా దానికి విపరీతమైన శిక్షలు ఉండేవి. వీటికి రాజు ఆమోదమే కాకుండా మతపరమైన అంగీకారమూ, ఆంక్షలూ ఉండేవి. దానిమూలంగా ఈ రిజర్వేషన్లు అవిచ్ఛిన్నంగా అమలవుతూనే వచ్చాయి. కొన్ని సందర్భాలలో అవే ఇంకా అమలవుతూ ఉన్నాయి. ఇవి ఎప్పటి నుంచి అమలవుతున్నాయో చెప్పటం కష్టం గాని దీనికి చట్టబద్ధత కల్పించిన కాల నిర్ణయంబట్టి ఇవి మనుధర్మశాస్త్రం అమలులోకి వచ్చినప్పటి నుంచీ ఉన్నాయని ఖచ్చితంగా చెప్పగలం. అంటే క్రీ.శ. 2వ శతాబ్దం నుంచీ అమలులో ఉన్నాయి. అంటే ఖచ్చితంగా రెండువేల సంవత్సరాల నుంచీ అమలులో ఉన్నాయని చెప్పవచ్చు.

రెండు వేల సంవత్సరాల నుంచీ రిజర్వేషన్లు అనుభవిస్తూ ఉన్నవారు కేవలం ఏభై ఏళ్ళపాటు రాజ్యాంగ రిజర్వేషన్‌ని సహించలేకపోతున్నారు. ఇంకా అమలుకాని రిజర్వేషన్‌ని వ్యతిరేకిస్తున్నారు. రిజర్వేషన్లు ఇప్పుడు రెండు రకాలు. ఒకటి మనుధర్మశాస్త్రంలోని రిజర్వేషన్లు, రెండు రాజ్యాంగంలోని రిజర్వేషన్లు. ఈ రెండింటి మధ్య సంకుల సమరం జరుగుతున్నది. ఇదే రిజర్వేషన్ల రగడ అంతా. అగ్రకులాలకు రిజర్వేషన్లు ఏమిటి? అనే ప్రశ్న కలగవచ్చు. కాని వారికే ఎక్కువ రిజర్వేషన్లు ఉన్నాయి. ఈ రిజర్వేషన్ వారు ఎలా అనుభవించారో పరిశీలిద్దాం.

**వర్ణ వ్యవస్థ :–** ఈ దేశంలో మొదటి నుండీ వర్ణ వ్యవస్థ ఉన్నది. ఆ వర్ణ వ్యవస్థ కుల వ్యవస్థగా మారింది. కులవ్యవస్థకు ముందు వర్ణాలు మూడు. అవి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలు. బ్రాహ్మణులు, క్షత్రియులుకాని జనమంతా వైశ్యులే. బ్రాహ్మణులు చదువు – వేదాలు – వేదపారాయణం, పూజలు పునస్కారాలు చేస్తూ ఉండేవారు. వారు తప్ప ఇంక ఎవరూ వేదం చదవకూడదు, నేర్వకూడదు, నేర్పకూడదు. క్షత్రియులు పరిపాలన చేస్తుండేవారు. మిగిలిన దేహ శ్రమ అంతా అంటే పంటలు పండించడం, బ్రాహ్మణ క్షత్రియులకు సేవ చెయ్యడం, వారికి కావలసినవి అన్నీ అందజేయటం వగైరా పనులు వైశ్యులు చేస్తుండేవారు. సమాజం పెరిగేకొలదీ, వృత్తులు పెరిగే కొలదీ, ఉత్పత్తి పెరిగే కొలదీ, పరిశ్రమలు పెరిగే కొలదీ కొత్త కులాలు పుట్టుకొచ్చాయి. వైశ్యులలో కొందరిని విడదీసి శూద్రులుగా చేశారు. దానితో కులాలు నాలుగు అయ్యాయి. ఆ తర్వాత మళ్ళీ వారిలో కొందరిని విడదీసి పంచమ కులంగా చేశారు. అదే అంటరాని కులం.

సమాజం వ్యావసాయికంగా పెరుగుతున్నప్పుడు దానికి కావలసిన సామగ్రి సరఫరా చేయటానికి వివిధ ఉత్పత్తులకూ వృత్తులు పుట్టుకొచ్చాయి. పట్టణాలు ఏర్పడటం మొదలయి

## ఇతర కులాలు ఉద్యోగాలలో ఎలా ప్రవేశించగలిగారు?

మొదటి నుంచీ అగ్రకులాల వారే చదువుకున్నారు కాబట్టి ఉద్యోగాలన్నీ వారికే దొరికాయి. వృత్తి పనుల వారు చదువుకోకూడదు అన్నారు కాబట్టి వారు ఉద్యోగాలలో ప్రవేశించే అవకాశం లేకపోయింది. అయితే వారు చదువుకోవడం మొదలుపెట్టిన తర్వాత కొద్ది కొద్దిగా వారూ ఉద్యోగాలలో ప్రవేశించడం ప్రారంభించారు.

అయితే జనాభాలో నూటికి రెండు – మూడు శాతం కంటే ఎక్కువలేని బ్రాహ్మణులు నూటికి తొంభై ఏడు శాతం ఉన్నత ఉద్యోగాల్లో ఉండేవారు. మిగిలిన మూడు శాతం ఉద్యోగాలు మిగిలిన తొంభై ఏడుగురూ పంచుకోవలసి వచ్చేది. ఈ మూడు శాతం అయినా క్రింది తరగతి ఉద్యోగాలు. బ్రాహ్మణులతో కలిపి అగ్రకులాలు నూటికి పదిహేను కంటే ఎక్కువ లేరు. ఈ నూటికి పదిహేనుగురూ నూటికి తొంభై ఏడు శాతం ఉద్యోగాలు అనుభవించే వారు. తక్కినవి తక్కిన ఎనభై అయిదు శాతం కులాలకూ! ఈ పద్ధతి కొన్ని వందల ఏళ్ళు జరిగింది. అంటే అగ్రకులాల వారికి నూటికి తొంభై ఏడు ఉద్యోగాలు రిజర్వు అయి ఉండేవి. కొన్ని కొన్ని శాఖల్లో అయితే – ఇంతకు ముందు చూసినట్టుగా జనాభాలో మూడు శాతం ఉన్న కులానికి నూటికి నూరుపాళ్ళ రిజర్వేషన్ ఉండేది.

క్రమేపీ అక్షరాస్యత పెరుగుతున్న వృత్తిపనుల వారిలో అసంతృప్తి బయలుదేరింది. తామేమో నూటికి ఎనభై అయిదుగురున్నారు – తమకు దక్కేవి నూటికి అయిదో, మూడో ఉద్యోగాలు! తరతరాల నుంచి అగ్రకులాల వారు ఉద్యోగాలు తన్నుకుపోతుంటే చూస్తూ ఉండిపోయిన వృత్తిపనుల వాళ్ళల్లో తీవ్రమైన అసంతృప్తి బయలుదేరింది. తమకు జరుగుతున్న అన్యాయాన్ని వారు గుర్తించారు. ఈ అన్యాయాన్ని చట్టబద్ధంకాని ఈ రిజర్వేషన్లను – మొదట గుర్తించి చక్కదిద్దింది. కొల్హాపూర్, బరోడా వంటి సంస్థానాలు. ఆపైన మద్రాసు రాష్ట్రం మైసూరు సంస్థానం. (సౌలభ్యం కోసం వృత్తిపనుల వారినందరినీ 'వెనుకబడిన తరగతులు' అని అంటున్నాను) వీరు మద్రాసు రాష్ట్రంలో ఈ అన్యాయానికి వ్యతిరేకంగా బ్రహ్మాండమైన ఉద్యమం ప్రారంభించారు.

## కమ్యూనల్ జీ.ఓ.

ప్రభుత్వ ఉద్యోగాలన్నీ ఒక్క బ్రాహ్మణ కులం కైవసం చేసుకుంటున్నాది అనే విషయాన్ని మొదట బ్రిటిష ప్రభుత్వం గుర్తించింది. ఇతర కులాల వారికి సర్వీసుల్లో ప్రవేశం కల్పించడానికి 1854వ సంవత్సరంలోనే చర్యలు తీసుకోవడం ప్రారంభించింది. దీని వెనుక వెనుకబడిన తరగతులు చేసిన బ్రహ్మాండమైన పోరాటం ఉన్నది. ఈ పోరాట ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగాలలోకి బ్రాహ్మణేతర కులాలను తీసుకోవడం మొదలయింది. ప్రభుత్వం ఒక ఉత్తరువు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగాలను కేవలం కొన్ని కుటుంబాలు

లేదా ఒక కులం గుత్తాధిపత్యం వహించడానికి వీలులేదు. అన్ని కులాలవారికి ఆ కుల జనాభా ప్రాతిపదికపైన ఉద్యోగాలు కల్పించాలని ఉత్తరువు జారీ చేసింది. ఆ ఉత్తరువు ఫలితంగా ప్రభుత్వోద్యోగాలలో బ్రాహ్మణేతరులను నియమించటం జరిగింది. 1881లో తయారు చేసిన లెక్కలు చూస్తే ఆనాటి పరిస్థితి మనకు తెలుస్తుంది.

**1881లో ప్రభుత్వ ఉద్యోగాలు కులాలు***

| కులాలు | జనాభా శాతం | 10 రూ॥లు అంతకు మించి జీతం ఉన్న ఉద్యోగులు | 10 రూ॥ల లోపు జీతం ఉన్న ఉద్యోగులు | మొత్తం |
|---|---|---|---|---|
| 1. బ్రాహ్మణులు | 3.6 | 42.2 | 4.4 | 19.2 |
| 2. ఇతర హిందువులు | 87.9 | 36.5 | 67.7 | 55.4 |
| 3. ముస్లిములు | 6.2 | 5.5 | 24.1 | 16.8 |
| 4. ఇక్కడి క్రైస్తవులు | 2.2 | 4.9 | 3.5 | 4.1 |
| 5. యూరోపియన్లు | 0.1 | 10.9 | 0.3 | 4.5 |

జనాభాను బట్టి ఉద్యోగాలు కేటాయించాలని బ్రాహ్మణేతరులు ఉద్యమం ప్రారంభించారు. మొదటిసారిగా బ్రాహ్మణేతరులు తమకూ ఉద్యోగాలలో వాటా కావాలి అని అడిగేసరికి బ్రాహ్మణులు దానిని వ్యతిరేకించారు. కులాల ప్రాతిపదికపై ఉద్యోగాలు ఇవ్వడం జరిగితే ప్రతిభ సామర్థ్యాలు దెబ్బతింటాయనే వాదన లేవదీశారు. ఉద్యోగాలు ప్రతిభ సామర్థ్యాల ప్రాతిపదికపైననే ఇవ్వాలి అనే వాదన ప్రచారం చేశారు. 'ప్రతిభ' అనే దాన్ని అడ్డంపెట్టి బ్రాహ్మణేతరులను ఉద్యోగాలలోకి రానివ్వకుండా చేయటానికి బ్రాహ్మణులు చాలా పెద్ద ప్రయత్నం చేశారు. బ్రాహ్మణుడు కాకపోతే అతను క్షత్రియుడైనా, వైశ్యుడయినా ఆఖరికి ఏ అగ్రకులస్థుడైనా సరే అతను ప్రతిభావంతుడు కాడు, సమర్థుడు కాడు, బ్రాహ్మణుడొక్కడే ప్రతిభావంతుడు సమర్థుడు అని వారి ఉద్దేశం. అసలు ఈ 'ప్రతిభ' 'సామర్థ్యం' అంటే ఏమిటో తర్వాత పరిశీలిద్దాం. బ్రాహ్మణేతరులు ఉద్యోగాలలోకి ప్రవేశించకుండా ఈ 'ప్రతిభ' అనే భూతాన్ని చాలా సమర్థవంతంగా ప్రవేశపెట్టారు. ఈ వాదనలన్నీ దాటి, దానిలో నిజంలేదని నిరూపించి కులాల ప్రాతిపదికపై ఉద్యోగాలు కల్పించడంలో బ్రాహ్మణేతర ఉద్యమం మద్రాసులో సఫలీకృతం అయింది. దీని ఫలితమే బ్రిటిషు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓ ఉత్తరువు. దీనిని కమ్యూనల్ జీ.ఓ. అనేవారు.

* ది హిస్టరీ ఆఫ్ ది స్ట్రగుల్ ఫర్ సోషల్ అండ్ కమ్యూనల్ జస్టిస్ ఇన్ టమిల్‌నాడు – కె. వీరమణి పే. 5.

## II

# రిజర్వేషన్లపై రగడలు ఎందుకు జరుగుతున్నాయి?

ఇంతకు ముందు రిజర్వేషన్లపై రేగిన రభస అంతా, చాలావరకు సమాజంలో ఆందోళన రూపంలో బయలుదేరేది. అటూ ఇటూ తీవ్రమైన చర్చలు జరిగేవి. అనుకూల, ప్రతికూల వాదనలు వినపడేవి. ఈసారి అలా కాకుండా నేరుగా సుప్రీంకోర్టులో ఈ వ్యవహారాన్ని లేవనెత్తారు. సుప్రీంకోర్టు కూడా చాలా తీవ్రంగానే స్పందించింది.

ఉన్నత విద్యా సంస్థల్లో వెనుకబడిన కులాలకు 27 శాతం రిజర్వేషన్ కేటాయించవలసిందిగా 2006లో కేంద్ర ప్రభుత్వం చేసిన ఉత్తరువును సుప్రీంకోర్టు నిలిపివేసింది. రాజ్యాంగ పరమైన అంశాలు భంగమైనాయో భగ్నమైనాయో అనే కారణం మీద కాదు– కేవలం వెనుకబడిన కులాల జనాభా లెక్కలు లేవు, ఏ ప్రాతిపదిక మీద మీరు 27 సంఖ్యను నిర్ణయించారని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా మందలించి, జనాభా లెక్కలు తీసేటంతవరకూ వెనుకబడిన కులాలకు ఉన్నత విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు ఇవ్వనవసరం లేదు. ఆ అంశాన్ని నిలిపివేస్తున్నాం అని ఓ ఉత్తరువును జారీచేసింది.

విద్యాసంస్థల్లో అసలు రిజర్వేషన్లు ఉండాలా వద్దా ఉంటే ఎంత కాలం కొనసాగించాలి అనే అంశాల మీద చర్చరేపినా అదృష్టవశాత్తు తీర్పు మాత్రం ఇవ్వలేదు. షెడ్యూల్డు కులాలకు/తెగలకు అమలులో ఉన్న రిజర్వేషన్లను మేము ముట్టుకోవటంలేదని కూడా స్పష్టం చేసింది. ఎటొచ్చీ దెబ్బ వెనుకబడిన కులాలకు తగిలింది. ఎవరీ వెనుకబడిన కులాలు? దేశ జనాభాలో ఎంత మంది ఉంటారు? ఏయే రాష్ట్రాలలో ఎంత శాతం ఉంటారు? ఎన్ని శతాబ్దాలుగా వీరు ఇలా వెనుకబడి ఉండిపోయారు. ఇలా ఎంతకాలం ఉంటారు? వీరిని ముందుకు తీసుకువచ్చే మార్గం ఏమిటి? కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఈ పద్ధతి రాజ్యాంగ బద్ధమేనా? అయితే ఎంత శాతం ప్రయోజనాన్ని కల్పించాలో అనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు విడిచిపెట్టలేదు? పెత్తనం సుప్రీంకోర్టు తన మీదనే ఎందుకు పెట్టుకున్నది? దేశ జనాభాలో వెనుకబడిన కులాలు 27 శాతం కూడా ఉండరనే నమ్మకం సుప్రీంకోర్టుకు ఉన్నదా? దేశం చాలా పురోగతి సాధించింది, వెనుక బడినవారు నూటికి ఇరవై ఏడు ఎక్కడుంటారనే అనుమానం సుప్రీంకోర్టుకు ఉన్నదా? రిజర్వేషన్లు కల్పించటానికి జనాభా లెక్కలు తీయవలసిన అవసరం ఏమొచ్చింది? రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పిస్తున్న అంశం ఇందుకు సంబంధించి అసలు ఏమి

చెపుతున్నది? సుప్రీంకోర్టు ఏమి చూసింది? దానికీ దీనికీ ఏమైనా పొంతన ఉన్నదా? రాజ్యాంగం చెప్పని అంశాలను సుప్రీంకోర్టు పరిగణనలోనికి తీసుకోవచ్చునా? సుప్రీంకోర్టు కొత్త అంశాలను రాజ్యాంగంలో చొప్పించవచ్చునా? కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కల్పించటానికి పనికివచ్చిన 27 అంకె, విద్యారంగంలో రిజర్వేషన్లు కల్పించటానికి ఎందుకు పనికిరాలేదు? గత పదిహేనేళ్ళుగా అమలులో ఉన్న ఆమోద యోగ్యమైన '27' అంకె హఠాత్తుగా సుప్రీంకోర్టుకు ఎందుకు అభ్యంతరమయింది! అసలు అవకాశాలు అంటూ ఇవ్వవలసి వస్తే ముందు విద్యారంగంలో కల్పించవలసి ఉంటుంది. విద్య లేకుండా ఉద్యోగాలు ఎలా వస్తాయి? ఉన్నత విద్యలో అవకాశాలు లేకుండా ఉన్నత పదవులు వెనుకబడిన కులాలకు ఎలా లభిస్తాయి? మామూలు విద్యలో రిజర్వేషన్లు కొనసాగిస్తే పెద్దగా అభ్యంతర పడవలసిన అవసరం లేదనుకున్నారా? సామాన్య విద్య నేర్చుకుంటే సామాన్యమైన ఉద్యోగాలు దొరుకుతాయి. క్రిందితరగతి ఉద్యోగాలలో వెనుకబడిన కులాలు ప్రవేశించినా మనం పెద్దగా అభ్యంతరం పెట్టవలసిన పనిలేదను కున్నారా? ఉన్నత పదవులలో చేరటానికి అవకాశం కల్పిస్తే మనతో పోటీపడతారనే భయం ఏమైనా ఉన్నదా? నాలుగో తరగతి ఉద్యోగాలకు, కాదంటే గుమాస్తా ఉద్యోగాలకు పనికివచ్చే చదువు వెనుకబడిన కులాలకు సరిపోతుంది, ఉన్నత విద్య వారికి ఎందుకు అనే భావన ఉన్నదా? ఎలానూ సమాజంలో వారు నాలుగో తరగతి వృత్తులనే నిర్వహిస్తూ వచ్చిన కులాలే కదా? ఉద్యోగ రంగంలో కూడా వారిని నాలుగో తరగతి స్థాయికే పరిమితం చేస్తే సరిపోతుందనే భావన మానసికంగా వారి మెదడులో స్థిరపడిపోయిందా? అసలు విద్యకు కొన్ని కులాలను శతాబ్దాలుగా దూరం చేసిన మనువాదులే, స్వతంత్ర భారతదేశంలో కూడా రాజ్యాధికారంలో ఉండి, అదే వాదాన్ని ఏదో విధంగా కొనసాగించాలని చూస్తున్నారా? సేవక వృత్తులకే పరిమితమైన కులాలను సేవక వృత్తికే పరిమితంచేసి, ఎట్టి పరిస్థితులలోనూ అధికారాన్ని వారితో పంచుకోవటానికి సిద్ధంగా లేకపోవటమా? ఇటువంటివే అనేకమైన ప్రశ్నలు తలెత్తుతాయి. వీటన్నిటికీ అటు సుప్రీంకోర్టు, ఇటు పాలకవర్గం గాని సమాధానాలు చెప్పవలసి ఉన్నది.

రాజ్యాంగం 1950లో అమలులోకి వచ్చేసరికి కొన్ని రాష్ట్రాల్లో వెనుకబడిన కులాలకు విద్య ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ రూపంలో ప్రాతినిధ్యం ఉండేది. అది కూడా ఆయా కులాల జనాభా ప్రాతిపదికపైన ఉండేది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత కూడా ఆ రిజర్వేషన్లు కొనసాగుతూ ఉన్నాయి. ఏ రాష్ట్రంలో కూడా ఈ విధానాన్ని మార్చుకొనే ప్రయత్నం ఏ ప్రభుత్వాలూ చేపట్టలేదు. ఏదో సాంకేతికపరమైన అంశాల మీద ప్రభుత్వం ఇస్తూ వస్తున్న ఉత్తరువులను అప్పుడప్పుడూ ఆయా ఉన్నత న్యాయ

## రిజర్వేషన్లూ - కార్యనిర్వాహక యంత్రాంగం

ప్రభుత్వ సర్వీసుల్లో షె.కు, షె.జా.లకు రిజర్వేషన్ ఏర్పాటు చేశారు. దానిని అమలు చేసే బాధ్యత కార్యనిర్వాహక యంత్రాంగానిది. అంటే ప్రభుత్వ అధికారులదన్న మాట! ఈ రిజర్వేషన్లు చిత్తశుద్ధితో అమలు జరుగుతున్నాయా లేక వమ్ము అవుతున్నాయా, అమలు జరుగుతుంటే ఎంత శాతం అమలు జరుగుతున్నాయి, స్వతంత్ర భారత జన జీవితంలో ఎంత శాతం ఈ రిజర్వేషన్లు అమలు చేయగలిగారు. నిజంగానే ఇక రిజర్వేషన్ల అవసరం లేకుండా పోయిందా, ఆ దశకు దేశం చేరగలిగిందా... ఇవన్నీ పరిశీలించాలి.

రిజర్వేషన్లు సరిగ్గా అమలు జరగడం లేదనేది, వాటికి సరైన ప్రాతినిధ్యం ఇవ్వ లేదనేది కూడా ఇంతకు ముందు చూపించిన లెక్కల ద్వారా వెల్లడయింది. ఇది సరిగ్గా అమలు జరగకపోవడానికి రెండు కారణాలు ఉన్నాయంటారు. ఒకటి – సరియైన అభ్యర్థులు ఈ కులాలలో లేకపోవడం; రెండోది అధికారులు ఈ రిజర్వేషన్‌ని సరిగ్గా పాటించక పోవడం. షె.కు, షె.జా.లకు కేటాయించిన స్థానంలో ఆ తరగతి అభ్యరి లభ్యమైనా – ఎంపికచేయక, వేరే కులం వానితో ఆ ఖాళీ భర్తీ చేయడం. రెండో కారణం మూలంగానే రిజర్వేషన్లు సరిగ్గా అమలు జరగడంలేదనటానికి ఎన్నో ఆధారాలున్నాయి. అనుభవం మీద తేలిందీ అదే. ఈ రంగంలో అధికార్ల ప్రవర్తన ఎలా ఉందో చూద్దాం.

రిజర్వేషన్ అమలు చేసేది అధికారులు. చట్టపరంగా ఉన్న వాటిని అమలు చేయడం అధికారుల విధి. అలా చెయ్యకపోతే అది నేరం. వారు శిక్షార్హులవుతారు. అయితే ఇలా ఎంతమందిని శిక్షించినట్టు! రిజర్వేషన్ అమలు చేయని నేరానికి ఇంతవరకూ ఎవరినీ శిక్షించలేదు అంటే దానిని భారత శిక్షాస్మృతి (ఇండియన్ పీనల్ కోడ్)లో నేరంగా చేర్చ లేదు కదా అని అనవచ్చు. చట్టంలో చెప్పిన దానిని చెయ్యకపోవడం నేరమే కదా! పైగా రాజ్యాంగ ఆదేశాలను ఉల్లంఘించటం!

దళిత జాతులకు తగిన ప్రాతినిధ్యం సర్వీసుల్లో కల్పించాలని మొదటిసారిగా 1934లో భారత ప్రభుత్వం ఉత్తరువులు జారీ చేసింది. ఆశించిన ఫలితాలు అందకపోయే సరికి భారత ప్రభుత్వం పరిస్థితిని సమీక్షించి 1943లో ఈ కులాలకు $8^{1/3}$% ఉద్యోగాలు రిజర్వు చేయవలసిందిగా ఉత్తరువులు జారీ చేసింది. 1946లో అప్పటి దేశ జనాభాలో షెడ్యూల్డు కులాల జనాభాను లెక్కల్లోకి తీసుకొని ఆ రిజర్వు స్థానాల శాతాన్ని $12^{1/2}$కు పెంచింది. రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టినప్పుడు మొత్తం ఈ విధానాన్ని రాజ్యాంగంలో పొందుపరిచారు. అప్పటికి షె.కు,లకు $12^{1/2}$, షె.జా.లకు 5% స్థానాలను కేటాయించారు. 1970 నాటికి ఈ శాతం వరుసగా 15కు $7^{1/2}$కు పెరిగింది. రాజ్యాంగ నిబంధనలు అనుసరించి, భారత ప్రభుత్వ విధానాల ప్రకారం ఆయా రాష్ట్రాలు కూడా రిజర్వేషన్‌కు

సంబంధించి నియమావళి తయారుచేసి ఉత్తరువులు జారీచేశాయి. ఈలోగా భారత ప్రభుత్వం వీరి విషయంలో కొన్ని సౌకర్యాలు, మినహాయింపులు కలుగజేసింది. ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్ ఏర్పాటు చేసింది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్రాన్ని అనుసరించాయి. కేంద్రం తీసుకున్న ఈ విధానాల వల్ల ఉద్యోగాలలో ఈ కులాల శాతం కొంత పెరిగిన మాట వాస్తవమే! అయితే ఇది ఎంత వరకు అనేది పెద్ద ప్రశ్న! 1965 నుంచి 1980 వరకు ఈ నియామకాలలో పెరుగుదల ఏ నిష్పత్తిలో ఉందో పరిశీలిద్దాం.*

| సం. | షెడ్యూల్డు కులాలు | | | | షెడ్యూల్డు జాతులు | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 1 | 2 | 3 | 4 |
| | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| | 1.64 | 2.82 | 8.88 | 17.75 | 0.27 | 0.34 | 1.14 | 3.39 |
| | 2.36 | 3.84 | 9.27 | 18.09 | 0.40 | 0.37 | 1.47 | 3.59 |
| | 3.43 | 4.98 | 10.71 | 18.64 | 0.62 | 0.59 | 2.27 | 3.99 |
| | 4.75 | 7.37 | 12.55 | 19.32 | 0.94 | 1.03 | 3.11 | 5.19 |
| | 4.83 | 8.07 | 11.54 | 19.16 | 1.04 | 1.24 | 3.04 | 5.30 |

* ది కమిషనర్ షెడ్యూల్డు కాస్ట్స్ అండ్ షెడ్యూల్డు ట్రైబ్స్ 1979–80. పే. 227–228

మొత్తం 184 పబ్లిక్ రంగ సంస్థల్లో 177 సంస్థల్లో షె.కు, షె.జా.ల ప్రాతినిధ్యం ఎలా ఉందో చూద్దాం.[1]

| గ్రూప్ | మొత్తం ఉద్యోగులు | షె.కు. ప్రాతినిధ్యం | | షె.జా. ప్రాతినిధ్యం | |
|---|---|---|---|---|---|
| | | సంఖ్య | శాతం | సంఖ్య | శాతం |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| గ్రూప్ ఎ | 93,984 | 2,726 | 2.90 | 623 | 0.66 |
| గ్రూప్ బి | 97,756 | 5,003 | 5.11 | 1,329 | 1.35 |
| గ్రూప్ సి | 12,74581 | 2,30,505 | 18.08 | 98,329 | 7.71 |
| గ్రూప్ డి (స్వీపర్లు మినహా) | 3,53,981 | 79,167 | 22.36 | 38,083 | 10.75 |
| గ్రూప్ డి (స్వీపర్లు) | 36,030 | 23,309 | 64.69 | 1,492 | 4.7 |
| మొత్తం | 18,56,332 | 3,40,710 | 18.35 | 1,39,856 | 7 |

1. కమిషన్ రిపోర్టు పే. 230

# III

# కులాలవారీ ఉద్యోగాలు

రాజ్యాంగంలో షె.కు./షె.జా./వె.త.లకు ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించారు. కొన్ని ప్రత్యేకమైన రక్షణలు ఉన్నాయి. ఏ రకమైన రాజ్యాంగ నిబంధన, రక్షణ లేకుండా కొన్ని నియామకాలు కులాల వారీగా జరుగుతూనే ఉన్నాయి. రాజ్యాంగం రాకముందు ఉద్యోగాలు కొన్ని కులాల వారికి ఖచ్చితంగా లభిస్తూ ఉండేవని, కొన్ని ఉద్యోగాలు కొన్ని కులాలవారికే ప్రత్యేకంగా కేటాయించి ఉండేవని ఇంతకుముందు చూశాం. ఎక్కడా ఏరకమైన ఏర్పాటు లేకుండా ఈ ప్రత్యేక రిజర్వేషన్లు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలలో అంతర్లీనంగా వస్తూనే ఉన్నాయి.

ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో మంత్రివర్గం ఎలా ఏర్పాటవుతుందో చూడండి. నిజానికి మంత్రివర్గంలో కులాలవారీగా పదవుల పంపకం లేదు. కాని కొన్ని ముఖ్యమైన కులాలకు మంత్రివర్గంలో ఖచ్చితంగా స్థానముంటుంది. ఆ స్థానాలు శాసన సభలో సభ్యుల ప్రాతిపదికపై గాని జనాభా శాతాన్ని బట్టి గాని ఉండవు. బ్రాహ్మణ కులానికి, ఉత్తర భారతదేశంలో ఉన్న ప్రముఖ కులాలకు తప్పనిసరిగా కేంద్ర మంత్రి వర్గంలో స్థానం ఉంటుంది. లేకపోతే మంత్రివర్గం ఏర్పాటు కానేకాదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం ఏర్పాటు పరిశీలిస్తే విషయం మనకు బోధపడుతుంది. రెడ్లు తప్పనిసరిగా ఉంటారు. వారి జనాభా దామాషాకు చాలా మించి ఉంటారు. రెడ్లు తర్వాత కమ్మవారు ఉండాల్సిందే. ఆ తర్వాత కాపులు, వెలమలు, బ్రాహ్మణులు, క్షత్రియులు ఎలానూ ఉంటారు. ముస్లిములు తప్పనిసరిగా ఉంటారు. బ్రాహ్మణులకు, రెడ్లకు, కమ్మవారికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉండాలని రాజ్యాంగంలో ఏ అధికరణా చెప్పటంలేదు. ఏ రకమైన సూచనలూ లేవు. అటువంటప్పుడు మంత్రివర్గంలో వారిని తప్పనిసరిగా ఎందుకు పెట్టుకుంటారు. ప్రతి మంత్రివర్గ ఏర్పాటులోనూ ఈ కులస్థులు ఉండి తీరాల్సిందే! ఎక్కడి ఏర్పాటిది? ఏ రకమైన రిజర్వేషన్ ఇది? ఈ రిజర్వేషన్ ఎంతకాలం కొనసాగుతుంది? వ్రాతపూర్వకంగా లేకపోయినా రాజ్యాంగంలో పొందుపరుచుకున్న ఆదర్శాలకు భిన్నంగా కన్పిస్తున్నా కులాల వారీగా పదవులు రిజర్వు అయ్యే ఉన్నాయిగా?

అదే విధంగా హైకోర్టు నియామకాలు చూస్తే ఈ కులాలవారీ రిజర్వేషన్ ఎంత ఖచ్చితంగా అమలు జరుగుతుందో తెలుస్తుంది! హైకోర్టు జడ్జీల నియామకంలో షె.కు./షె.జా.లకు రిజర్వేషన్ లేదు. రిజర్వేషన్ లేదు కాబట్టి ఈ తరగతి వారిని జడ్జీలుగా చేయనవసరం లేదు. కులాలవారీగా నియామకం జరగాలి అనే నిబంధన ఏదీ లేకపోయినా

జడ్జీలను నియమించవలసి వచ్చినప్పుడు ఒక రెడ్డి, ఒక బ్రాహ్మణుడు, ఒక కమ్మ, ఒక కాపు, ఒక క్షత్రియుడు, ఒక ముస్లిము, ఇతర జాతుల వారికి ఒకటి ఇస్తూనే ఉన్నారు. నాలుగు నియామకాలు జరగాలంటే ఒక రెడ్డి, ఒక బ్రాహ్మణుడు, ఒక కమ్మ, ఒక ముస్లిమ్ ఉండాల్సిందే! ఇది ఏరకమైన రిజర్వేషన్? అంతటితో ఆగదు! ఒక కులానికి చెందిన జడ్జీ పదవీ విరమణ చేసినా, హఠాత్తుగా చనిపోయినా ఆ ఖాళీని అదే కులానికి చెందిన వ్యక్తితో నింపుతారు. నియామకంలోనూ కులాలవారీగా నియామకం చేసి, ఖాళీలను నింపే సమయంలో కూడా అదే కులంవానికిస్తే మరి పదవులు కూడా కులాల వారీగా రిజర్వు అయినట్టే కదా! ఇది రాజ్యాంగంలో ఏ అధికరణ సూచిస్తున్నది? ఈ రక్షణలు ఎవరు కల్పిస్తున్నారు? రాజ్యాంగంలో లేకపోయినా కులాలవారిగా జడ్జీలను నియమస్తున్నారు. ఇది రిజర్వేషన్ కాదా? ఖచ్చితంగా ఎవరో ఒక రెడ్డికి, కమ్మకు ఒక బ్రాహ్మణుడికి, ఒక క్షత్రియునికి, ఒక కాపుకు, ఒక ముస్లింకు పదవి తప్పక దొరుకుతుంది గదా! మరి ఇది ఏ రకమైన రిజర్వేషన్?

కులాలవారీగా జడ్జీలు నియామకం అవుతున్నప్పుడు 'ప్రతిభ' పడిపోతున్నదే అని ఎవరూ గగ్గోలుపెట్టరు. ఎప్పుడో వంద ఏళ్ళ తర్వాత ఒక షె.కు./షె.త.కు చెందిన జడ్జీని నియమించారనుకోండి, ఇంకేమిటి? న్యాయవ్యవస్థ తలకిందులైపోతుంది. ధర్మదేవత చేతిలో త్రాసు అటూ ఇటూ ఊగిపోతుంది. ప్రతిభ పడిపోతుంది. అంటే అగ్రకులాల వారికి పదవులు దొరుకుతున్నంత సేపు ఏ ప్రమాదమూ ఉండదు, ఏ ప్రతిభా దెబ్బతినదు! ఏ షె.కు./షె.త. వారికో ఆ పదవి లభిస్తే అన్ని ప్రమాదాలూ ముంచుకు వస్తాయి! వారికి అవసరమైన రిజర్వేషన్ పద్ధతి మరొకరికి పనికిరాదన్న మాట. ఎందుకు ఈ రిజర్వేషన్లు వారు వ్యతిరేకిస్తున్నారంటే అగ్రకులాలకే పరిమితమైన విద్యా ఉద్యోగాలు తక్కువ కులాల వారు అందులోనూ పనిచేసుకు బ్రతికే మరీ నీచమైన పనిచేసుకు బ్రతికే కులాల వారు పొందకూడదనేదే స్పష్టమవుతున్నది. అంతేకాని ప్రతిభ పడిపోతున్నదనీ కాదు, సామర్థ్యం తరిగిపోతున్నదనీ కాదు... కొన్ని తరాలపాటు వారు అనుభవిస్తున్న అవకాశాలలో వాటా అడుగుతున్నారనేదే అసలైన కారణం. నిజమైన ప్రజాస్వామ్యంలో అధికులదే కదా అధికారం. అటువంటప్పుడు అధికంగా ఉన్న షె.కు./షె.త/వె.త.లకు ఉద్యోగావకాశాలు తక్కువ సంఖ్యలో ఉన్న అగ్రకులాలు కల్పించడం ఏమిటి? ఎంత శాతం ఉండాలి? ఎన్నేళ్ళపాటు ఉండాలి అనేది తక్కువ సంఖ్యలో ఉన్నవారు ఎలా నిర్ణయిస్తారు? నిర్ణయించే అధికారం అవకాశం ఎక్కువ సంఖ్యలో ఉన్నవారికి ఉండాలి కాని, తక్కువ సంఖ్యలో ఉన్న వారికి ఎలా ఉంటుంది? ఉన్నదీ అంటే మనది ప్రజాస్వామ్యం కాదన్నమాట! నిర్ణయాలు అన్నీ తక్కువ సంఖ్యలో ఉన్నవారే చేస్తున్నారన్న మాట. వారి దగ్గర ఉన్న యుక్తులు శక్తులు అన్నీ ఉపయోగించి ఇంతవరకూ నిర్ణయిస్తూ వస్తూ ఉన్నారు. అవి

## రిజర్వేషన్ల వల్ల దేశ సమైక్యత దెబ్బతింటున్నదా?

రిజర్వేషన్ల వ్యతిరేకవాదులు లేవనెత్తుతున్న ప్రధాన అభ్యంతరాలలో ఇది ఒకటి. ఇది ఎక్కువమందిని ఆకర్షిస్తున్నది. దేశ సమైక్యత దెబ్బతింటున్నది అని అంటే ఎవరైనా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తారు. ఎన్ని త్యాగాలయినా చేసి దేశసమైక్యతను కాపాడటం అందరి ప్రథమ కర్తవ్యం. కాబట్టి ఈ సమస్య గురించి చాలామంది తీవ్రంగానే ఆలోచిస్తారు. ఆ అభియోగం ఎవరో సామాన్యులు లేదా అనుభవంలేని విద్యార్థులు అంటున్నది కాదు, కేవలం గుడ్డి వ్యతిరేకత ఉండే మత సంస్థలో కులసంస్థలో చేస్తున్న అభియోగమూ కాదు. మేధావులు అనుకొనేవారు, జాతి జీవనంలో ముఖ్యమైన బాధ్యతలు చేపట్టి పరిపాలనలో ఎంతో అనుభవం గడించిన వారు చేస్తున్న అభియోగం ఇది. దీని గురించి కొంచెం తీవ్రంగా ఆలోచించాలి. నిజంగానే రిజర్వేషన్ల మూలంగా దేశసమైక్యతకు భంగం కలుగుతున్నదా?

శత్రువును నిర్మూలించటానికి ప్రత్యర్థి అనేక మార్గాలు ఆలోచిస్తాడు. అనేక పరికరాలు ఉపయోగిస్తాడు, అనేక బాణాలు వేస్తుంటాడు, అనేక ఆయుధాలు ఉపయోగిస్తాడు. ఉపయోగిస్తున్న ఆయుధాలవల్ల ప్రయోజనం కలగకపోతే ఇంకా కొంచెం పటిష్ఠమైన, పదునైన, తీవ్రమైన ఆయుధాన్ని ఉపయోగిస్తుంటాడు. ఒకోసారి యుద్ధానికి సంబంధించిన నియమాలు కూడా ఉల్లంఘిస్తుంటారు. వారికి కావలసింది శత్రు సంహారం, తాము విజయలక్ష్మిని వరించటం.

రిజర్వేషన్ వ్యతిరేకిస్తున్న వారు సరిగ్గా చేస్తున్న పని ఇదే. రిజర్వేషన్ల వల్ల ప్రతిభ దెబ్బతింటున్నది అని మొదట అన్నారు. లేదు అని రుజువయింది. ఇలా బాణాలు వేస్తూ పోయారు. వేసిన నాలుగు బాణాలవల్ల ప్రయోజనం కనిపించకపోయేసరికి ఈ అయిదో బాణం వేశారు.

ఈ అభియోగంలో నిజం ఎంత ఉన్నదో పరిశీలించే ముందు దేశ సమైక్యతకు భంగం కలిగించే అంశాలు అసలు ఏవేవి అని పరిశీలించాలి.

ప్రజా ఉద్యమాలు వేటిని ప్రారంభించినా అవి దేశ సమైక్యతకు, జాతి భద్రతకు ముప్పువాటిల్ల చేస్తాయని అనటం 'పాలకవర్గాలకు ఒక అలవాటు అయిపోయింది. ఎవరో ఒక ప్రతిపక్ష నాయకుడో, ప్రజా ఉద్యమకర్తో ఏదేని ఒక మాట అన్నా ఒక ఆందోళన లేవదీసినా అది జాతి సమైక్యతకు భంగం వాటిల్లుతుందని జాతీయ భద్రతా చట్టం క్రిందనో ఆంతరంగిక భద్రతా చట్టం క్రిందనో అరెస్టు చేస్తుంటారు. ఆ మాటకు వస్తే ఒక కథ, ఒక నాటకం, ఒక పాట కూడా జాతి భద్రతకు, దేశ సమైక్యతకు భంగం వాటిల్లేది అవుతుందని నిషేధించడాలు మనం చూస్తూ ఉన్నాం. అంటే ఈ దేశభద్రత ఈ జాతి సమైక్యత అంత సున్నితమైన వస్తువులా అని అనుమానం వస్తుంది. ఇవన్నీ

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Idi+Reservationla+Desam](http://kinige.com/book/Idi+Reservationla+Desam)

* * *